సాక్షి
అనంతపురం
బుధవారం । 23 । జూలై । 2025



చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు పలికాయి.



టమాట కిలో రూ.40

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టం రూ.40, కనిష్టం రూ.30, సరాసరి రూ.20 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
31.4°/21.5°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఖాద్రీశుడి ఆర్జిత కల్యాణం.. భక్తులకు అవకాశం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం చేయించాలనుకునే భక్తులకు ఆలయ పాలక మండలి అవకాశం కల్పిస్తోంది. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని దాదాపు 17 రోజుల పాటు నిర్వహించే ఆర్జిత కల్యాణోత్సవాలను భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేసింది. ఆసక్తి కలిగిన భక్తులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ ఈఓ వెండి దండి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రావణ మాసం శుక్ల పాడ్యమి (ఈనెల 25వ తేదీ) నుంచి ఆగస్టు 25వ తేదీ వరకు కల్యాణోత్సవాలు జరుగుతాయని వెల్లడించారు. కల్యాణం నిర్వహించే తేదీల్లో రోజుకు 5 టికెట్లు మాత్రమే జారీ చేస్తామన్నారు. ఒక్కో టికెట్ ధర రూ.6,500 ఉంటుందని, ఒక టికెట్‌పై ఐదుగురికి మాత్రమే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 25, 27, 30, 31 తేదీల్లో, ఆగస్టు 3, 4, 5, 10, 11, 12, 13, 18, 19, 20, 21, 24, 25 తేదీల్లో మాత్రమే శ్రీవారి కల్యాణోత్సవాలు ఉంటాయన్నారు. ఆయా రోజుల్లో ఉదయం 10.30 గంటల నుంచి స్వామి వారి ఆర్జిత కల్యాణోత్సవం ప్రారంభమవుతుందని ఈఓ పేర్కొన్నారు.

పాత కల్లూరు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సస్పెన్షన్

గార్లదిన్నె: మండల పరిధిలోని పాత కల్లూరు ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్న నరసింహులును సస్పెండ్ చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి చంద్రా నాయక్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన మేరకు.. ఈ నెల 15న ఎంఈఓ-1 చంద్రా నాయక్,ఎంఈఓ-2 వెంకటరమణ నాయక్‌లు ద్విచక్రవాహనంలో పాత కల్లూరు ప్రాథమిక పాఠశాల తనిఖీ కోసం బయలుదేరారు. మండలంలోని గుడ్డాలపల్లి క్రాస్ సమీపంలో హెచ్‌ఎం నరసింహులు ఓ ద్విచక్ర వాహనంలో వెనకాల కూర్చొని కల్లూరు వైపు వెళ్తున్నట్లు గుర్తించారు. ద్విచక్రవాహనం ఆపాలని ఎంఈఓలు కోరినా లెక్కచేయకుండా హెచ్‌ఎం పాఠశాలకు వెళ్లిపోయారు. ఈ క్రమంలోనే ఎంఈఓలు కూడా పాఠశాలకు చేరుకుని నరసింహులుతో మాట్లాడారు. పాఠశాల సమయంలో ఎందుకు బయటకెళ్లారని ప్రశ్నిస్తుండగానే అక్కడే ఉన్న హెచ్‌ఎం కుమారుడు విశ్వనాథ్ ఎంఈఓల సెల్‌ఫోన్ లాక్కొని కిందకు పడేసి దౌర్జన్యానికి దిగాడు. ఈ విషయంపై విచారణ చేపట్టిన డీఈఓ ప్రసాద్ బాబు హెచ్‌ఎం నరసింహులును సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'ఇలాగైతే పనులు చేసుకోలేం'

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగులను ప్రజాప్రతినిధులు నోటికొచ్చినట్లు దుర్భాషలాడుతూ బెదిరింపులకు గురిచేస్తుంటే పనులు చేసుకోలేమని పలువురు ఉద్యోగ అసోసియేషన్ల ప్రతినిధులు వాపోయారు. డీపీఓ నాగరాజునాయుడుపై తాడిపత్రి మునిసిపల్ చైర్మన్ జేసీ దివాకర్‌రెడ్డి ఇటీవల రెచ్చిపోయి మాట్లాడడం, దుర్భాషలాడడాన్ని వారు ఖండించారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓల అసోసియేషన్, డిప్యూటీ ఎంపీడీఓల అసోసియేషన్, పంచాయతీ కార్యదర్శుల సంఘం, సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. జేసీని చూసి మరొకరు రెచ్చిపోతారని, ఇలాగైతే అధికారులు, ఉద్యోగుల మానసిక స్థైర్యం దెబ్బతింటుందన్నారు. ఉద్యోగులతో ఇబ్బందులుంటే పై అధికారులకు ఫిర్యాదు చేయొచ్చని, అంతేకానీ బహిరంగంగా నోటి కొచ్చినట్లు మాట్లాడితే ఎలా అని మండి పడ్డారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మృత్యు రహదారి



- శింగనమల మండలం సోదనపల్లికి చెందిన రామాంజినేయులు ఈ ఏడాది ఏప్రిల్ 2న బైక్‌పై అనంతపురం బయలుదేరాడు. శింగనమల మరువకొమ్మ క్రాస్ వద్ద అనంతపురం వైపు వెళ్లడానికి ఎన్‌హెచ్ 544-డీ జాతీయ రహదారి దాటుతున్న ఆయన్ను ఓ కారు వేగంగా దూసుకొచ్చి ఢీకొంది. దీంతో రామాంజినేయులు తీవ్ర గాయాలపాలయ్యాడు. కాళ్లు విరిగాయి. రెండు నెలలు ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆయన ఇటీవల డిశ్చార్జ్ అయ్యాడు. చిన్నగా నడవగలుగుతున్నాడు.
- ఈ నెల 20న తాడిపత్రి నుంచి సొంతూరు గుమ్మేపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్తున్న దంపతులు రఘునాథరెడ్డి, సావిత్రమ్మను శింగనమల మరవకొమ్మ క్రాస్ వద్ద కారు వేగంగా ఢీ కొంది. తీవ్రగాయాలైన రఘునాథరెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, సావిత్రమ్మను 108 వాహనంలో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు విడిచింది. అనతికాలంలోనే చోటుచేసుకున్న ఈ ఘోర రోడ్డు ప్రమాదాలు.. ఆ ప్రాంతంలో పరిస్థితికి అద్దం పడుతున్నాయి.

హడలెత్తిస్తున్న శింగనమల మరవకొమ్మ క్రాస్

- అండర్‌వే బ్రిడ్జి నిర్మించకపోవడంతో తరచూ ప్రమాదాలు
- రోడ్డు దాటేందుకూ భయపడుతున్న ప్రజలు
- అధికారులు, ప్రజాప్రతినిధులకు వివరించినా ప్రయోజనం శూన్యం



మూడు రోజుల క్రితం మరువకొమ్మ క్రాస్ వద్ద ప్రమాదంతో భీతావహంగా మారిన ఆ ప్రాంతం

శింగనమల: శింగనమల మరువకొమ్మ క్రాస్ వద్ద జాతీయ రహదారి హడలెత్తిస్తోంది. ఇక్కడ రోడ్డు దాటాలన్నా కూడా ప్రజలు బెంబేలెత్తుతున్నారు. అనంతపురం నుంచి రాజధాని అమరావతికి ఎన్‌హెచ్-544డీ రోడ్డు నిర్మాణాన్ని నాలుగు లైన్లుగా చేపడుతున్నారు. ఇందులో భాగంగా అనంతపురం పాములరాయి నుంచి రెడ్డిపల్లి వరకు నాలుగు చోట్ల అండర్ వేబ్రిడ్జిలు నిర్మించారు. రెడ్డిపల్లి-రోటరీపురం మార్గంలో కొర్రపాడు వద్ద, సీ.బండమీదపల్లి, పోతురాజుకాల్వ, పెరవలి, నాయనపల్లిక్రాస్ వద్ద బ్రిడ్జిల నిర్మాణం చేపట్టారు.

అధికారుల పాపం.. ప్రజలకు శాపం

నియోజకవర్గ కేంద్రమైన శింగనమలలోకి వెళ్లాలంటే శింగనమల మరువకొమ్మ క్రాస్ వద్ద ఎన్‌హెచ్ 544-డీని క్రాస్ చేయాల్సి వస్తోంది. ఈ క్రమంలో అక్కడ వే బ్రిడ్జి నిర్మించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. 2018లో 544 డీ రహదారికి అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. అందులో శింగనమల మరువకొమ్మ క్రాస్ నుంచి నియోజకవర్గ కేంద్రం మార్గంలో అండర్ వేబ్రిడ్జి ప్రతిపాదన చేయలేకపోయారు. ఆ పాపం నేడు శాపంలా మారి ప్రజలను పట్టి పీడిస్తోంది.శింగనమల నుంచి అనంతపురం వైపు వెళ్లే, తాడిపత్రి నుంచి శింగనమలకు వచ్చే సమయాల్లో రోడ్డు క్రాస్ చేయాల్సి వస్తోంది. ఈ క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు అతి వేగంగా వెళ్తుండడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ రహదారి దాటాల్సి వస్తోంది. కొంచెం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు పైకి పోయే అవకాశం ఉంది. రోడ్డు నిర్మించిన అనతికాలంలోనే పెద్ద ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. కేవలం అండర్ వే బ్రిడ్జి లేకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రాణాలను కాపాడండి



శింగనమల మరువకొమ్మ క్రాస్ వద్ద రోడ్డు దాటే సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. రోజూ చాలా ఇబ్బంది పడుతున్నాం. ఇక్కడ అండర్ వేబ్రిడ్జి నిర్మించి ప్రజల ప్రాణాలను కాపాడాలని అధికారులను కోరుతున్నాం.
– భాస్కర్‌రెడ్డి, ఆటో డ్రైవరు, శింగనమల

త్వరితగతిన స్పందించాలి



శింగనమల మరువకొమ్మ క్రాస్‌లో ఇప్పటికే రెండు ప్రమాదాలు జరిగాయి. ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.
– పూల ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, శింగనమల

పోరాటాలు చేస్తున్నా..

అండర్ వేబ్రిడ్జి కోసం శింగనమలవాసులు పార్టీలకతీతంగా పోరాటాలు చేపట్టారు. కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారులు, స్థానిక రెవెన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఇటీవల అధికారులు, ప్రజా ప్రతినిధులు పర్యటించి, అండర్ వే బ్రిడ్జి నిర్మాణం తక్షణ అవసరమని గుర్తించారు. ఎన్‌హెచ్ అధికారులకు ప్రతిపాదనలు పంపారు. కానీ ఇంతవరకు మంజూరు కాకపోవడం గమనార్హం.

'ఈ-చలాన్ ఫైళ్ల'తో జాగ్రత్త

అనంతపురం: ఈ-చలాన్ పేరుతో వచ్చే నకిలీ ఏపీకే ఫైళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ జగదీష్ అన్నారు. ఆ లింక్స్‌పై తొందరపడి క్లిక్ చేయొద్దని సూచించారు. వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా 'ఆర్టీఓ ట్రాఫిక్ చలాన్. ఏపీకే' అనే పేరుతో వైరల్ అవుతోందన్నారు. ఈ లింక్‌ను క్లిక్ చేసి డౌన్‌లోడ్ చేసుకునే వారి ఫోన్‌లో రహస్య సమాచారాన్ని సైబర్ నేరగాళ్లు చోరీ చేసే ప్రమాదం ఉందన్నారు. ఇదివరకు పీఎం కిసాన్ యోజన, ఎస్బీఐ క్రెడిట్ కార్డులు, రివార్డులు, కేవైసీ అప్డేట్ పేరుతో సైబర్ మోసాలకు పాల్పడిన దుండగులు ఇటీవల ట్రాఫిక్ చలానా పేరుతో ప్రజలను లూటీ చేసేందుకు సిద్ధమయ్యారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

- గుర్తు తెలియని, అనధికార లింక్‌లపై క్లిక్ చేయరాదని ఎస్పీ కోరారు. యాప్స్ ఎల్లప్పుడూ గూగుల్ ప్లేస్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచే డౌన్‌లోడ్ చేయాలని సూచించారు. ఓటీపీ అలర్ట్స్‌ను ఎనేబుల్ చేసుకోవాలన్నారు. అనుమతి లేకుండా లావాదేవీలు జరిగితే వెంటనే కార్డును బ్లాక్ చేయాలన్నారు. సైబర్ నేరాలపై ఫిర్యాదు చేయడానికి వెంటనే 1930కి కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in ద్వారా తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

గురుకులాల్లో అందుబాటులో ఇంటర్ సీట్లు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని ఉరవకొండ, బ్రహ్మసముద్రం, నల్లమాడలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఇంటర్ హెచ్ఈసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో మొదటి సంవత్సరం (బాలికలకు మాత్రమే) ప్రవేశాలకు సీట్లు అందుబాటులో ఉన్నాయని గురుకుల పాఠశాలల సమన్వయ అధికారి కె.జయలక్ష్మీ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని కోరారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం





'ఇంటింటికీ వంచన' క్యూఆర్ కోడ్ పోస్టర్లను విడుదల చేస్తున్న అనంత, వైవీఆర్, నైరుతిరెడ్డి తదితరులు, హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

- కూటమి మోసాలను పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- బాబును మించిన మోసగాళ్లు లేరు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, మాజీ ఎమ్మెల్యే వైవీఆర్

పామిడి: అన్ని వర్గాల సంక్షేమం కోరే పార్టీనే నిజమైన రాజకీయ పార్టీ అని, అలాంటి పార్టీ ఏదైనా ఉందంటే అది కేవలం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీనే అని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు.మంగళవారం స్థానిక ఎద్దులపల్లిరోడ్డులోని రహమత్ ఫంక్షన్‌హాలులో 'రీకాలింగ్ సీఎం బాబూస్ మేనిఫెస్టో- బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ'లో భాగంగా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనంతతో పాటు పార్టీ గుంతకల్లు నియోజకవర్గ సమన్వయకర్త వై.వెంకట్రామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు వై. నైరుతి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ.. దేశంలోనే చంద్రబాబు లాంటి అబద్ధాల కోరు లేరన్నారు. 13 నెలల పాలనలో ప్రజలకు ఒరగబెట్టింది శూన్యమన్నారు. ఏ ఒక్క హామీని నెరవేర్చకపోగా రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి పాలనలో పంటల సాగు విస్తీర్ణం పడిపోవడం వ్యవసాయ సంక్షోభానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. వైఎస్సార్ సీపీలో కార్యకర్తలే అధినాయకులు, రారాజులన్నారు. వచ్చే నెల 4 నుంచి 'గడప గడపకు' కార్యక్రమంలో కార్యకర్తలే ప్రధాన భూమిక పోషించాలని, చంద్రబాబు వంచనను ప్రజలకు వివరించాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రజలకు బాబు బురిడీ..

వైఎస్సార్ సీపీ గుంతకల్లు నియోజకవర్గ సమన్వయకర్త వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ప్రజలను బురిడీ కొట్టించడంలో చంద్రబాబుకు మించిన వారు లేరన్నారు. కులం, మతం, పార్టీ అన్న భేదం లేకుండా జనరంజక పాలనతో మాజీ సీఎం జగన్ ప్రజాహృదయాల్లో నిలిచిపోయారన్నారు. కూటమి ప్రభుత్వ కార్యక్రమాలకు జనం కరువవడం సీఎం చంద్రబాబు అసమర్థ పాలనను తేటతెల్లం చేస్తోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం కోసం నాయకులు కలసికట్టుగా పనిచేయాలన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి మాట్లాడుతూ తమకు ప్రజా సంక్షేమం కంటే మరేదీ ముఖ్యం కాదన్నారు. బాబు, ఆయన తనయుడు లోకేష్‌ల రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాష్ట్రం అల్లకల్లోలంగా మారిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చుక్కలూరు దిలీప్‌రెడ్డి, కుమ్మెత లక్ష్మి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి, ఆసిఫ్, జిల్లా నేతలు కే నారాయణరెడ్డి, ఆర్‌సీ వెంకట్రామిరెడ్డి, బోయ రామచంద్ర, అనుంపల్లి సూరి, సాకే ఓబులేసు, పట్టణ, రూరల్ కన్వీనర్లు నాగూరు ఈశ్వర్ రెడ్డి, రమావత్ రామకృష్ణనాయక్, వైస్ కన్వీనర్లు సల్లా వుద్దీన్, నీలూరు హరినాథ్‌రెడ్డి, సర్పంచ్‌లు మూలి నాగేశ్వర్‌రెడ్డి, నారాయణస్వామి, చీమల నగేష్, అన్వర్‌ఖాన్, బొల్లు వెంకట్రామిరెడ్డి, రుక్మాన్, గౌస్, అబుసాలేహా, రాజు, శివ, స్వామినాయక్, నాగార్జున, అనిల్‌కుమార్, బుజ్జిబాబు, చుక్కలూరు రామచంద్రారెడ్డి, నీలం సంజీవరెడ్డి, నీలం ఆనందరెడ్డి, బయపరెడ్డి, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై ఎక్కువ ఫిర్యాదులు

- ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అసంతృప్తి



అనంతపురం అర్బన్: 'ఇంటింటి చెత్త సేకరణ సరిగా చేయడం లేదు. చాలా మండలాల్లో 50 శాతానికి మించి ప్రజల నుంచి ఇదే అభిప్రాయం వస్తోంది' అంటూ ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అసంతృప్తి వ్యక్తం చేశారు. సక్రమంగా చెత్త సేకరణ జరగని మండలాల ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలకు మెమోలు ఇవ్వాలని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలు నుంచి పంచాయతీ సెక్టార్, జీఎస్‌డబ్ల్యూఎస్ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి చెత్త సేకరణపై చాలా మండలాల్లో 50 శాతానికి మించి ప్రతికూల అభిప్రాయం వచ్చిందన్నారు.క్షేత్రస్థాయిలో సరిగా పనిచేయని అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌ను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. తల్లికి వందనం ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. ఏపీ సేవా సర్వీసెస్ డ్యాష్ బోర్డు, మన మిత్ర క్యాంపెయిన్ పెండింగ్ రెండు రోజుల్లో పూర్తి కావాలన్నారు. సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్ వంద శాతం నమోదవ్వాలన్నారు. సమావేశంలో డీపీఓ నాగరాజునాయుడు, సీపీఓ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

'అగ్రిగోల్డ్' రికార్డులు సిద్ధంగా ఉంచుకోండి

- డీఆర్‌ఓ మలోల



అనంతపురం అర్బన్: జిల్లాలో అగ్రిగోల్డ్ ఆస్తుల భౌతిక ధ్రువీకరణ పూర్తిచేసి వాటి రికార్డులు సిద్ధంగా ఉంచుకోవాలని డీఆర్‌ఓ ఎ.మలోల సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అగ్రిగోల్డ్ ఆస్తులపై కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ సంస్థలో డిపాజిట్లకు సంబంధించిన ఆస్తుల అటాచ్‌మెంట్‌పై జిల్లాస్థాయిలో జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటైందన్నారు. ఆ సంస్థ ఆస్తుల మార్కెట్ విలువ గుర్తించాలన్నారు. ఆస్తుల మ్యుటేషన్‌పై దృష్టి పెట్టాలన్నారు. సంస్థ భూముల ప్రస్తుత స్థితి, ఆక్రమణలు, కోర్టు కేసులు తదితర అంశాలు పరిశీలించాలన్నారు. అన్ని వివరాలను సంబంధిత తహసీల్దార్లు, సబ్‌రిజిస్ట్రార్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో ఆర్‌డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్, సూపరింటెండెంట్లు వసంతలత, యుగేశ్వరిదేవి, రియాజుద్దీన్, కర్నూలు సీఐడీ ఇన్‌స్పెక్టర్ ప్రీతం రెడ్డి, సీఐ అశోక, ఎస్ఐ శివకుమార్ నాయక్, జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసులు, డీఐపీఆర్ఓ బాలకొండయ్య, ఐటీ అధికారి రవి, ఎస్ఐసీ డీఐఓ రవిశంకర్, తహసీల్దార్లు సోమశేఖర్, శేషారెడ్డి, సుమతి, శ్రీనివాసులు, అగ్రిగోల్డ్ ప్రతినిధి ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీఆర్‌కు తుంగభద్ర జలాల మళ్లింపు

- మరమ్మతుల కారణంగా పీఏబీఆర్‌కు నీటి తరలింపు వాయిదా
- డ్యాంలో డెడ్ స్టోరేజీకి చేరిన నీరు



మోపిడి వద్ద పీఏబీఆర్ రెగ్యులేటరీ పనులు

ఉరవకొండ: మండల పరిధిలోని మోపిడి లింక్ చానల్ నుంచి మిడ్‌పెన్నార్ డ్యాంకు మంగళవారం హెచ్చెల్సీ అధికారులు నీటిని మళ్లించారు. పీఏబీఆర్‌కు నీటి తరలింపును వాయిదా వేశారు. ఆంధ్రా సరిహద్దులో ప్రస్తుతం 900 క్యూసెక్కుల నీరు వస్తుండగా, కణేకల్లు నుంచి మోపిడి లింక్ ఛానల్‌కు 470 క్యూసెక్కులు మాత్రమే విడుదల చేశారు. ఎంపీఆర్, పీఏబీఆర్ రెగ్యులేటరీ పనుల కారణంగా ఈ ఏడాది జిల్లాకు నీరు పూర్తి స్థాయిలో అందడం గగనంగా మారింది. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు తాగునీరందించే పీఏబీఆర్‌లో నీరు డెడ్ స్టోరేజీకి చేరుకుంటోంది. ఇప్పటికే జలాశయానికి ఇన్‌ఫ్లో నిలిచిపోయింది. ప్రస్తుతం 1.7 టీఎంసీల నీరుంది. ఉరవకొండ మండలం మోపిడి వద్ద రెగ్యులేటరీ పనులు కొనసాగుతుండటంతో మరో నెల వరకు నీటిని పీఏబీఆర్‌కు మళ్లించే పరిస్థితి కన్పించడం లేదు. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో తాగునీటి ఎద్దడి ఏర్పడటం ఖాయంగా కన్పిస్తోంది.

జిల్లాకు చేరుకున్న కృష్ణా జలాలు

వజ్రకరూర్/ఉరవకొండ: కృష్ణా జలాలు జిల్లాలోకి ప్రవేశించాయి. ఈ నెల 17న కర్నూలు జిల్లా మాల్యాల వద్ద శ్రీశైలం జలాశయం బ్యాక్‌వాటర్ నుంచి కృష్ణా జలాలను సీఎం చంద్రబాబు విడుదల చేయగా.. అధికారులు హంద్రీ-నీవా కాలువకు నీటి పంపింగ్ ప్రారంభించారు. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం కర్నూలు జిల్లాను దాటుకుని వజ్రకరూరు మండలం ఛాయపురం సమీపంలోని 134 కిలోమీటరుకు కృష్ణా జలాలు చేరుకున్నాయి. హంద్రీ-నీవా చీఫ్ ఇంజినీర్ నాగరాజు, ఇతర అధికారులు, గ్రామస్తులతో కలిసి జలహారతి ఇచ్చారు. రాగులపాడు లిఫ్ట్ వద్ద నీటిని పంపింగ్ చేసి జీడిపల్లి రిజర్వాయర్‌కు పంపనున్నారు. కార్యక్రమంలో ఎస్ఈ రాజాస్వరూప్, ఈఈ శ్రీనివాస్‌నాయక్, డీఈఈ రమణ, ఏఈ సురేష్‌నాయక్, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ చెప్పుకోలేని బాధ!

- అనంతపురంలో వేధిస్తున్న పబ్లిక్ టాయిలెట్ల కొరత
- ప్రజలకు తప్పని అవస్థలు
- మహిళల పరిస్థితి మరీ ఘోరం
- కూటమి ప్రభుత్వంపై విమర్శల పర్వం





అనంతపురం సూర్యానగర్ క్రాస్‌లో ఉన్న సులభ్ కాంప్లెక్స్, అనంతపురం తాడిపత్రి బస్టాండ్ సర్కిల్ వద్ద అధ్వానంగా సులభ్ కాంప్లెక్స్ పరిసరాలు

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం నగరంలో తగినన్ని పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడం ప్రజలకు శాపంగా మారింది. జిల్లా కేంద్రానికి రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. పాతూరు, క్లాక్‌టవర్, కమలానగర్ తదితర ప్రాంతాల్లో కూరగాయలు, నిత్యావసర సరుకులు, ఇతర సామగ్రి కొనుగోలు కోసం పెద్ద సంఖ్యలో జనం వస్తుంటారు. పాఠశాలలు, కళాశాలల్లో చదువుల నిమిత్తం వచ్చే విద్యార్థులు వేల సంఖ్యలో ఉంటారు. గుత్తి రోడ్డు, రామ్‌నగర్, కళ్యాణదుర్గం, బళ్లారి బైపాస్ పరిసరాలు, సప్తగిరి సర్కిల్ తదితర ప్రాంతాలు కూడా ప్రజలతో నిత్యం కిటకిటలాడుతుంటాయి. ఆయా చోట్ల ఎక్కడా పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడంతో జనం ఇబ్బందులు చెప్పనలవిగా మారాయి. మహిళల పరిస్థితి మరీ ఘోరంగా ఉంటోంది.

సులభ్ కాంప్లెక్స్‌లు కంపు..కంపు

అనంతపురం నగరంలో పదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన పే అండ్ యూజ్ టాయిలెట్స్ (సులభ్ కాంప్లెక్స్‌లు) 10 ఉన్నాయి. ప్రస్తుతం ఇవి అధ్వాన స్థితికి చేరుకున్నాయి. ఆయా టాయిలెట్లకు వెళ్లాలంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అక్కడి ఘోర పరిస్థితులను చూసి పరుగులు పెడుతూ బయటకు వచ్చేస్తున్నారు. డబ్బు వసూలు చేస్తున్నా.. అందుకు తగ్గట్టుగా సురక్షిత ప్రమాణాలు కనిపించడం లేదు.

సమస్యలు తప్పవు..

యూరిన్ వచ్చినప్పుడు వెళ్లకపోవడం, ఎక్కడపడితే అక్కడ విసర్జన చేయడం తదితర కారణాలతో సమస్యలు తలెత్తుతాయని డాక్టర్లు అంటున్నారు. యూరినరీ ట్రాక్ ఇన్‌ఫెక్షన్స్ సోకే ప్రమాదం ఉందని అనంతపురానికి చెందిన యూరాలజిస్టు డాక్టర్ రాజశేఖర్ చెప్పారు. సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో రోజూ 30 నుంచి 50 వరకూ యూరినరీ ట్రాక్ ఇన్‌ఫెక్షన్స్ కేసులు నమోదవుతుండడం గమనార్హం.

టెండర్ ఖరారైనా..

విజన్ 2047 అంటూ ఊదరగొడుతున్న కూటమి నేతలు చేతల్లో మాత్రం చూపించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నెలన్నర క్రితం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులు రూ.1.28 కోట్లతో నగరంలోని కోర్టు రోడ్డు, సాయినగర్ 5వ క్రాస్, మెడికల్ కాలేజ్, పీటీసీ, కేఎస్‌ఆర్ కళాశాల, సంగమేష్ సర్కిల్, బస్టాండ్, రెండో రోడ్డు జంక్షన్‌లో పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. టెండర్ ఖరారైనా, ఇంత వరకు పనులు మాత్రం మొదలుకాలేదు. ఇప్పట్లో పనులను చేపడతారో లేదో కూడా తెలియని పరిస్థితి. ఇప్పటికే నగరాభివృద్ధిని పాలకులు విస్మరించారు. ఈ క్రమంలో కనీసం ప్రాథమిక అవసరాలను తీర్చడంలో కూడా విఫలమవుతుండడంపై ప్రజలు మండిపడుతున్నారు.

క్లుప్తంగా

వైభవంగా మస్తానయ్య ఉరుసు


షంషీర్‌ను ఊరేగిస్తున్న దృశ్యం

గుంతకల్లు: స్థానిక పాత గుంతకల్లు ప్రాంతం మస్తానయ్య నామస్మరణతో మార్మోగింది. హజరత్ మస్తాన్‌వలి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా అత్యంత కీలకమైన షంషీర్ ఊరేగింపు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. వేకువజామున పుష్పాలతో అందంగా అలకంరించిన షంషీర్‌ను గుర్రంపై కొలువు దీర్చి మేళాతాళలతో దర్గా నుంచి గణాచారిరెడ్డి కులస్తుల ఇంటికి చేర్చారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం తిరిగి దర్గాకు తీసుకువచ్చారు. వేలాది భక్తులు తరలిరావడంతో పాత గుంతకల్లు జనసంద్రమైంది. ఊరేగింపులో ఎండ కొబ్బరి కాల్చేందుకు భక్తులు ఎగబడ్డారు. చక్కెర చదివింపులు, తులభారాలు, జంతుబలులతో మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం జియారత్ కార్యక్రమంతో మస్తానయ్య ఉరుసు ఉత్సవాలు ముగిస్తాయని వక్ఫ్‌బోర్డు అధికారి రహీం, దర్గా కమిటీ సభ్యులు తెలిపారు.

ముసలమ్మ ఆలయంలో చోరీ


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రం సమీపంలోని ముసలమ్మ కట్ట వద్ద వెలసిన ముసలమ్మ ఆలయంలో చోరీ జరిగింది. ఆలయ ధర్మకర్త సుశీలమ్మ తెలిపిన మేరకు... సోమవారం అర్ధరాత్రి సమయంలో ఆలయంలోకి దుండుగులు చొరబడి సీసీ ముందుగా సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. హార్డ్‌డిస్క్‌తో పాటు హుండీను ఎత్తుకెళ్లి ఆలయం వెనుక భాగాన ధ్వంసం చేసి, అందులోని నగదు, కానుకలను అపహరించారు. చోరీ సొత్తు విలువ దాదాపు రూ.5 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంను రంగంలో దించి నిందితుల వేలి ముద్రలను సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సకల పాప హరం.. హనుమద్ దర్శనం

ఆధ్యాత్మిక, ఆనందాల సమ్మేళనాల శ్రావణ మాసం శనివారంతో ప్రారంభం కానుంది. నాగుల పంచమి, రాఖీపౌర్ణమి, వరలక్ష్మీవ్రతం, మంగళగౌరి వ్రతం, శ్రీకృష్ణ జన్మాష్టమి, పొలాల అమాస్య తదితర ముఖ్యమైన వ్రతాలు ఈ మాసంలోనే వస్తాయి. మహిమాన్వితమైన శ్రావణ మాసంలో హనుమద్ దర్శనం సకల పాపాలను హరిస్తుందని నమ్మకం. ప్రత్యేకించి వ్యాసరాయలు ప్రతిష్టించిన మూడు హనుమద్ క్షేత్రాలను ఒకే రోజు దర్శించుకుంటే ఎంతటి కష్టమైనా ఇట్టే దూరమవుతుందని భక్తుల విశ్వాసం. దీంతో ఈ శ్రావణ మాసంలో జిల్లాలోని నేమకల్లు, మురడి, కసాపురంలోని హనుమద్ క్షేత్రాల సందర్శనకు భక్తులు పోటెత్తనున్నారు.

- శ్రావణ మాసంలో మూడు ఆలయాలను దర్శించుకుంటే పుణ్యఫలం
- ప్రత్యేక ఏర్పాట్లలో దేవదాయశాఖ అధికారులు
- జిల్లా వ్యాప్తంగా 100 బస్సులు నడిపేలా ఆర్టీసీ కార్యాచరణ
- ఈ నెల 26న తొలి శ్రావణ శనివారం


నేమకల్లు ఆంజనేయస్వామి


మురడి ఆంజనేయస్వామి


కసాపురం ఆంజనేయస్వామి

గుంతకల్లు రూరల్/బొమ్మనహాళ్/రాయదుర్గం: అంజనీ సుతుడిని శ్రావణ మాసంలో దర్శించుకుంటే అన్ని కష్టాలు దూరమవుతాయని భక్తుల నమ్మకం . జిల్లాలో ప్రముఖంగా చెప్పుకునే నేమకల్లు, మురడి, కసాపురం ఆలయాల్లో శ్రావణ మాసంలో హనుమద్ దర్శనానికి చాలా ప్రత్యేకత ఉంది. ఈ మూడు ఆలయాలను ఒకే రోజులో దర్శించుకుంటే అంతా మంచే జరుగుతుందని భక్తుల విశ్వాసం.

భక్తుల పాలిట కొంగుబంగారమై..

జిల్లాలో భక్తుల పాలిట కొంగుబంగారంగా, భక్తజన వరదాయకుడిగా నేమకల్లు, మురడి, కసాపురంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయాలు విరాజిల్లుతున్నాయి. క్రీ.శ. 15వ శతాబ్దంలో వ్యాసరాయమహర్షి ఒకే రోజున ఈ ఆలయాల్లో విగ్రహాలను ప్రతిష్టించినట్లు చరిత్ర తెలుపుతోంది. శ్రావణ మాసంలో వచ్చే మంగళ, శని వారాల్లో ఈ మూడు ఆలయాలను దర్శించుకుంటే కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ఈ నెల 26న వచ్చే తొలి శ్రావణ శనివారం నుంచి నేమకల్లు, మురడి, కసాపురం ఆలయాల్లో శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రత్యేక పూజలు, భజనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, రథోత్సవాలతో ఆలయాల్లో సందడి నెలకొననుంది. ఈ నేపథ్యంలో మూడు ఆలయాలను సర్వాంగ సుందరంగా అలకరించారు. భక్తుల సౌకర్యార్థం బారికేడ్లు, వసతి గృహాలు సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 26, ఆగస్టు 2, 9, 16, 23వ తేదీల్లో వచ్చే శనివారాలు, ఈ నెల 29, ఆగస్టు 5, 12, 19వ తేదీల్లో వచ్చే మంగళవారాల్లో మూడు ఆలయాలను సందర్శించి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు పోటెత్తుతుంటారు.

ఆలయాల విశేషం

జాతక దోషంతో సింహాసనం కోల్పోయిన శ్రీకృష్ణదేవరాయలు.. ఆ దోషం తొలగిపోయేందుకు 732 ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రతిష్టించాలని వ్యాసరాయలు సూచించినట్లు సమాచారం. ఇందులో భాగంగానే ముందుగా హంపీలో యంత్రోధారక ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్టించినట్లు చరిత్ర చెబుతోంది. అనంతరం పెనుకొండ వద్ద 103 ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్టించారు. చివరకు నేమకల్లు, మురడి, కసాపురంలో ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్టించే సమయంలో వ్యాసరాయ మహర్షి దివ్య దృష్టితో విష్ణుమూర్తి వామన రూపంలో వచ్చి మూడు అడుగుల స్థలాన్ని తీసుకున్న ప్రాంతాలు ఇవేనని గుర్తించి, మూలవిరాట్‌లకు ప్రాణప్రతిష్ట గావించారు. శ్రావణ మాసంలో ఈ మూడు ఆలయాలను ఒకే రోజు శ్రీకృష్ణదేవరాయలు దర్శించుకోవడంతో జాతక దోషం తొలిగిపోయింది. అప్పటి నుంచి ఈ మూడు ఆలయాలను శ్రావణ మాసంలో ఒకే రోజు దర్శించుకుంటే ఎంతటి కష్టమైనా తొలగిపోతుందని భక్తులు విశ్వసిస్తూ వస్తున్నారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

శ్రావణమాసంలో ఒకే రోజు మూడు ఆలయాలను దర్శించుకునేలా ఉమ్మడి జిల్లాలోని అన్ని డిపోల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ప్రతి శని, మంగళవారాల్లో అనంతపురం జిల్లాలోని 7 ఆర్టీసీ డిపోల నుంచి దాదాపు 100 బస్సులు నడిపేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలోని ఆరు డిపోల నుంచి కూడా ప్రత్యేక బస్సులను నడపనున్నారు. కనీసం 50 మంది భక్తులు ఏకతాటిపైకి వచ్చి మూడు ఆలయాల సందర్శనకు ముందుకు వస్తే వారు కోరుకున్న ప్రాంతానికి ప్రత్యేకంగా బస్సును పంపేందుకు ఆర్టీసీ అధికారులు సిద్ధంగా ఉన్నారు.

ప్రతి శనివారం ప్రాకారోత్సవం

ఉత్సవాల్లో భాగంగా ఈనెల 26వ తేదీన మొదటి శనివారం కసాపురంలో స్వామివారిని వజ్రకవచంతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. సాయంత్రం సీతారామచంద్ర లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్లను శేషవాహనంపై కొలువుదీర్చి ఆలయ పురవీధుల్లో ప్రాకారోత్సవం నిర్వహిస్తారు. అదేవిధంగా ఆగస్టు 2వ తేదీ రెండో శనివారం ఉత్సవమూర్తులను హనుమద్ వాహనంపై, ఆగస్టు 9 మూడో శనివారం గజ వాహనంపై, ఆగస్టు 16 నాల్గవ శనివారం గరుడ వాహనంపై, ఆగస్టు 23 ఐదో శనివారం ఒంటె వాహనంపై స్వామివారిని కొలువుదీర్చి ఆలయ పురవీధుల్లో ప్రాకారోత్సవం నిర్వహిస్తారు. శ్రావణమాసంలో వచ్చే నాలుగు మంగళవారాలు కూడా ఉత్సవమూర్తులను వెండిరథంలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహిస్తారు.

ఏర్పాట్లు పూర్తి..



ఆలయంలో నెల రోజుల పాటు వైభవంగా జరిగే శ్రావణమాస ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశాం. స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. భక్తుల కోసం గుంతకల్లు రైల్వే స్టేషన్, బస్టాండ్ నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారు.

– కె.వాణి, ఆలయ ఈఓ, కసాపురం

ఆలయాల్లో ప్రత్యేక సౌకర్యాలు



ఈ ఏడాది శ్రావణ మాసంలో భక్తుల సంఖ్య అధికంగానే ఉంటుందని ముందస్తుగా అంచనాకు వచ్చాం. ఇందుకు తగినట్లుగానే భద్రత, సౌకర్యాలు కల్పించాం. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాం. శని, మంగళవారాల్లో అన్నదానం లాంటి కార్యక్రమాలు ఉంటాయి.

– నరసింహారెడ్డి, ఈఓ, రాయదుర్గం

విధుల్లోకి అరబిక్ టీచర్లు

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం ఎడ్యుకేషన్: మైనార్టీ కేజీబీవీల్లో పని చేస్తున్న అరబిక్ టీచర్లు ఎట్టకేలకు విధుల్లోకి చేరారు. కురుగుంట, గుంతకల్లు, తాడిపత్రి, కేజీబీవీల్లో పదేళ్లుగా పని చేస్తున్న అరబిక్ టీచర్లను ఈ విద్యా సంవత్సరం నుంచి అవసరం లేదంటూ రాష్ట్ర ప్రాజెక్ట్ కార్యాలయం నుంచి మౌఖిక ఆదేశాలు అందాయి. ఈ క్రమంలో జిల్లాలో ఈనెల 17 నుంచి వారిని తప్పించారు. అయితే అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. పదేళ్లుగా పని చేస్తున్న తమను మౌఖిక ఆదేశాలతో తప్పించడం పట్ల అరబిక్ టీచర్లు సోమవారం ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారయణ్‌శర్మను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ అంశంపై 'కేజీబీవీ అరబిక్ టీచర్లకు షాక్' శీర్షికతో 'సాక్షి'లో మంగళవారం కథనం వెలువబడింది. స్పందించిన సమగ్రశిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు.. ఈ అంశాన్ని సీరియస్‌గా పరిగణిస్తూ కేజీబీవీ సెక్రటరీ దేవానందరెడ్డితో మాట్లాడారు. స్టేట్ ఆఫీస్ నుంచి అధికారిక ఉత్తర్వులు పంపలేదని, మౌఖిక ఆదేశాలతో ఎలా తప్పిస్తారంటూ ప్రశ్నించారు. వారిని కొనసాగించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా సమగ్ర శిక్ష అధికారుల ఆదేశాలతో ఆయా కేజీబీవీల ఎస్‌ఓల నుంచి అరబిక్ టీచర్లకు పిలుపు వెళ్లడంతో వారు మంగళవారం మధ్యాహ్నానికి విధుల్లో చేరారు.

ఉపాధ్యాయుడి ఔదార్యం.. బడిలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు


విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఉపాధ్యాయుడు అశ్వత్థనారాయణ

బెళుగుప్ప: మండలంలోని దుద్దేకుంట గ్రామంలో ఉన్న జెడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేస్తున్న ఫిజిక్స్ ఉపాధ్యాయుడు అశ్వత్థనారాయణ... కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. తన మిత్రుల సహకారంతో సమీకరించిన రూ.8 లక్షలతో 20 కంప్యూటర్లు, ఫర్నీచర్‌ను కొనుగోలు చేసి పాఠశాలలో ల్యాబ్ ఏర్పాటు చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

నిరుద్యోగి ఆత్మహత్య

తాడిపత్రి టౌన్: ఉద్యోగ అన్వేషణలో విసిగి వేసారిన ఓ నిరుద్యోగి బలవంతంగా తనవు చాలించాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి పట్టణంలోని విజయనగర్ కాలనీకి చెందిన ఇస్మాయిల్, షరీఫ్‌బీ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు మన్సూర్‌వలి (22) ఉన్నారు. మన్సూర్‌వలి బీటెక్ పూర్తి చేసి రెండేళ్లవుతోంది. ఏడాదిగా ఉద్యోగాల కోసం ముమ్మర ప్రయత్నం చేస్తున్నాడు. అయినా ఎలాంటి అవకాశాలు రాకపోవడంతో మనస్తాపం చెందిన ఆయన మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

- ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ దివాకర్‌రావు డిమాండ్


డీపీఓ నాగరాజునాయుడును పరామర్శిస్తున్న ఏపీజేఏసీ అమరావతి నాయకులు

అనంతపురం అర్బన్: జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ దివాకర్‌రావు డిమాండ్ చేశారు. అధికారి విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యలను, వ్యవహరించిన తీరును ఖండించారు. డీపీఓను ఆయన చాంబర్‌లో మంగళవారం దివాకర్‌రావుతో పాటు జేఏసీ ప్రధాన కార్యదర్శి పీఎస్‌ఖాన్, వైస్ ప్రెసిడెంట్ కొండయ్య, నాయకులు మూర్తి, ఓబులేసుతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా దివాకర్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వంలో భాగమైన ఉద్యోగులకు సహకరించాల్సిన ప్రజాప్రతినిధులు వారిపైనే దాడులకు సిద్ధపడడం బాధాకరమన్నారు. ప్రజాప్రతినిధుల వద్దనే ఉద్యోగులకు రక్షణ కరువైతే ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుని ప్రభుత్వ సిబ్బంది, అధికారులకు భరోసా కల్పిస్తారని ఆశిస్తున్నామన్నారు.

ఎస్‌ఐల బదిలీ

అనంతపురం: వీఆర్‌లో ఉన్న ఆరుగురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ పి.జగదీష్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీసీఆర్‌బీకి జి.రాజేంద్రప్రసాద్, సీసీఎస్‌కు ఎ.దాదాపీర్, ఎస్.జయప్ప, ఎన్.రాజశేఖర్‌రెడ్డి, అనంతపురం రూరల్ యూపీఎస్‌కు సి.బాబు, బుక్కరాయసముద్రం యూపీఎస్‌కు వి.రాంప్రసాద్ బదిలీ అయ్యారు.

'సూపర్'కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

అనంతపురం మెడికల్: ఉమ్మడి జిల్లా ప్రజలకు వైద్య సేవలు మరింత మెరుగుపరిచేలా అనంతపురంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసే ఆలోచనను మానుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, ప్రజారోగ్య వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొండయ్య డిమాండ్ చేశారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాంటూ ఆస్పత్రి ఎదుట ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో నిర్వహించడం సబబు కాదన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది నియామకాలు చేపట్టాలని, క్రిటికల్ కేర్ యూనిట్‌ను ప్రారంభించాలని కోరారు. కేసులను నేరుగా ఇక్కడే అడ్మిట్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించాలన్నారు. అనంతరం డిమాండ్లపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజారోగ్యవేదిక జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ప్రసూన, డాక్టర్ వీరభద్రయ్య, ఏజీ రాజమోహన్, సీఐటీయూ, రైతు సంఘం, ఏపీఎంఎస్‌ఆర్‌యూ, పెన్షనర్స్ అసోసియేషన్, హ్యూమన్ రైట్స్ ఫోరం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

జగతి మెచ్చేలా సత్యసాయి జయంత్యుత్సవం

- అక్టోబర్ 15 నాటికి ఏర్పాట్లు పూర్తి చేయాలి : అజయ్‌జైన్

ప్రశాంతి నిలయం: సత్యసాయి శత జయంత్యుత్సవాన్ని జగతి మెచ్చేలా చేద్దామంటూ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ టీఎస్ చేతన్‌తో కలిసి సత్యసాయి శత జయంత్యుత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఏర్పాట్లన్నీ అక్టోబర్ 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. భక్తుల రాకకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం, మొబైల్ టాయిలెట్లు, వీధి దీపాలు వంటి ప్రాథమిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. బెంగళూరు-పుట్టపర్తి రోడ్డు మార్గాన్ని మరమ్మతు చేయాలని, కొత్తచెరువు – పెనుకొండ, బ్రాహ్మణపల్లి – ఎనుములపల్లి మార్గాలను యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చేయాలన్నారు. ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌తో పాటు ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీ ఉండేలా ఇంటర్నల్ రింగ్‌రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

మహిళలు, పిల్లల భద్రతే లక్ష్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: మహిళలు, పిల్లల భద్రతే లక్ష్యంగా డ్రోన్లతో నిఘా పెంచనున్నట్లు ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. జిల్లాలోని శక్తి టీమ్స్‌కు డ్రోన్ల వినియోగంపై మంగళవారం పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలపై వేధింపులు, అఘాయిత్యాలు జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఎస్పీ దిశానిర్దేశం చేశారు. అంతకు ముందుమహిళలు, చిన్నారుల భద్రతే లక్ష్యంగా ఏర్పాటు చేసిన శక్తి టీమ్స్ వినియోగించే 28 ద్విచక్రవాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. శక్తి టీమ్స్ జిల్లాలోని కళాశాలలు, పార్కులు, రద్దీ ప్రదేశాలు, షాపింగ్ మాల్స్, ఆర్టీసీ బస్టాండు, ముఖ్య కూడళ్లలో నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో మహిళా పీఎస్ డీఎస్పీ ఎస్.మహబూబ్‌బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర రెడ్డి, సీఐలు ధరణి కిశోర్, క్రాంతి కుమార్, వెంకటేశులు, ఆర్‌ఐలు మధు, పవన్‌కుమార్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో చోరీ

గుత్తి రూరల్: మండలంలోని ఊబిచెర్ల గ్రామ శివారున ఉన్న రైతు సేవాకేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు రైతుసేవా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ తలుపులు ధ్వంసం చేసి లోపలకు ప్రవేశించారు. కేంద్రాల్లో ఉన్న వస్తువులు, పేపర్లు చిందరవందరగా పడేశారు. మంగళవారం ఉదయం వెళ్లిన సిబ్బంది.. తలుపులు ధ్వంసమై ఉండడం గమనించి లోపలకు వెళ్లి పరిశీలించారు. రైతు సేవాకేంద్రంలో నిల్వ చేసిన కందుల బ్యాగులతో పాటు, ఓ కంప్యూటర్, కుర్చీలు అపహరించినట్లు గుర్తించి సమాచారం ఇవ్వడంతో ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చోరీకి విఫలయత్నం

గుత్తి: స్థానిక అమృత్ సినిమా థియేటర్ కాంప్లెక్స్‌లోని మూడు షాపుల్లో సోమవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. రామకృష్ణ దుస్తుల దుకాణం, శ్రీకాంత్ మొబైల్ షాపు, తాయి వెంకటేష్ షాపులో చోరీకి విఫలయత్నం జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

చిరుత దాడిలో పొట్టేలు మృతి

బెళుగుప్ప: మండలంలోని బ్రాహ్మణపల్లి తండా సమీపంలో సోమవారం రాత్రి గడ్డి దొడ్డిలో ఉన్న పొట్టేలుపై చిరుత దాడి చేసి తినేసింది. మంగళవారం ఉదయం దొడ్డి వైపుగా వెళ్లిన రైతు కె.తిప్పేస్వామి నాయక్ గుర్తించి కన్నీటి పర్యంతమయ్యాడు. ఎంతో ముద్దుగా పెంచుకుంటున్న పొట్టేలు మృతితో రూ.12 వేలు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు, పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

రాజకీయ దురుద్దేశంతోనే అక్రమ అరెస్ట్

- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి


మాట్లాడుతున్న వై.విశ్వేశ్వరరెడ్డి

కదిరి: రాజకీయ దురుద్దేశంతోనే రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసిందని వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన కదిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ పార్టీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి, జైలుకు పంపి ప్రభుత్వం శునకానందం పొందుతోందన్నారు. పాలన మరిచి ప్రతిపక్షం గొంతునొక్కే ప్రయత్నం చేస్తే భవిష్యత్‌లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను చంద్రబాబు పక్కనబెట్టి, అక్రమ అరెస్టలతో డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సరైన సమయంలో ప్రజలే ఆయనకు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. లిక్కర్ స్కాం అనేది పూర్తిగా చంద్రబాబు కల్పితమని, ఈ కేసులో అక్రమంగా అరెస్ట్ అయిన మిధున్‌రెడ్డితో పాటు మిగిలిన వారు కూడా కడిగిన ముత్యంలా బయటకు రావడం ఖాయమన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బి.ఎస్.మక్బూల్ అహ్మద్, రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లోకేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

నకిలీ డాక్టర్ బాగోతం బట్టబయలు

- కిడ్నీ మార్పిడి పేరుతో ఘరానా మోసం



తాటిచెట్లపాలెం(విశాఖ జిల్లా): కిడ్నీలు మార్పిస్తానంటూ నమ్మించి, తనను తాను డాక్టర్‌గా పరిచయం చేసుకుని అమాయకులను మోసం చేస్తున్న వ్యక్తిని విశాఖపట్నం ఫోర్త్ టౌన్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. డాక్టర్ ఆనంద్ అనే పేరుతో చెలామణి అవుతున్న ఈ వ్యక్తి అసలు పేరు సయ్యద్ హనీఫ్ షా. అతను వైద్యుడు కాదని పోలీసులు తేల్చారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాలివి.


మోసం చేసిన తీరిది

అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన సయ్యద్ హనీఫ్.. కిడ్నీ దాతల వివరాలు ఆన్‌లైన్‌లో సేకరించి, వారికి ఫోన్ చేసేవాడు. తాను డాక్టర్ ఆనంద్‌నని, కిడ్నీ మార్పిడికి అన్ని ఏర్పాట్లు చేస్తానని నమ్మించేవాడు. బాధితులను విశాఖపట్నం రప్పించి, అక్కయ్యపాలెం హైవే సమీపంలోని బీకాన్ హోటల్‌లో గదులు బుక్ చేయించేవాడు. ఆ తర్వాత లాయర్ ఫీజు, ఇతర ఖర్చుల పేరుతో వారి నుంచి ఫోన్‌పే ద్వారా వేలాది రూపాయలు వసూలు చేసేవాడు. డబ్బు తన ఖాతాలో పడగానే బాధితుల ఫోన్ నంబర్లను బ్లాక్ చేసి, అదృశ్యమయ్యేవాడు. ఇదే క్రమంలో జనవరి 28న ఒడిశాకు చెందిన ముగ్గురు వ్యక్తులను విశాఖకు రప్పించాడు. ఫోన్‌పే ద్వారా రూ.4 వేలు తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. తర్వాత వారి ఫోన్ నంబర్లకు బ్లాక్ లిస్ట్‌లో పెట్టేశాడు. జనవరి 30న మరో ఇద్దరిని అదే హోటల్‌కు రప్పించాడు. లాయర్ ఫీజు అని చెప్పి డబ్బులు వేయమని వారిని కోరగా.. తమ వద్ద ఫోన్ పే లేదని, నేరుగా కలుద్దామని చెప్పడంతో వారి నంబర్లను బ్లాక్‌లో పెట్టేశాడు. బాధితులు హోటల్ బిల్లులు కూడా చెల్లించకుండా వెళ్లిపోవడంతో, మోసపోయిన హోటల్ మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యాపారి కాస్తా.. నకిలీ డాక్టర్‌గా..

హోటల్ మేనేజర్ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడు సయ్యద్ హనీఫ్ రైస్ వ్యాపారంలో తీవ్రంగా నష్టపోయాడు. అప్పుల ఊబిలో కూరుకుపోయి, తన కిడ్నీ అమ్ముకోవడానికి హైదరాబాద్ వెళ్లాడు. అయితే అధిక కొలెస్ట్రాల్ కారణంగా అతని కిడ్నీ దానానికి పనికిరాదని వైద్యులు తేల్చారు. దీంతో సులభంగా డబ్బు సంపాదించేందుకు ఈ మార్గాన్ని ఎంచుకున్నాడు. 2016లో కూడా మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఒక వ్యక్తి నుంచి ఇదే విధంగా రూ.10 వేలు వసూలు చేసి మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడి కాల్ డేటా, బ్యాంక్ ఖాతాలను పరిశీలించగా, అతనికి ఏ ఆసుపత్రితో గానీ, వైద్యులతో గానీ ఎటువంటి సంబంధాలు లేవని, ఇది కేవలం ఆర్థిక మోసం మాత్రమేనని పోలీసులు నిర్ధారించారు. నిందితుడు సయ్యద్ హనీఫ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

వివాహిత బలవన్మరణం


భారతి (ఫైల్)

గుంతకల్లు రూరల్: మండలంలోని నల్లదాసరపల్లి గ్రామానికి చెందిన మస్తాన్, పద్మ దంపతుల కుమార్తె భారతి (20) ఆత్మహత్య చేసుకుంది. ఏడాది క్రితం ఆమెకు గుంతకల్లులోని తిలక్ నగర్‌కు చెందిన రామాంజనేయులు కుమారుడు రాముతో వివాహమైంది. తొలి కాన్పుకోసం పుట్టింటికి వెళ్లిన భారతి మూడు నెలల క్రితం మగ పిల్లవాడిని ప్రసవించింది. ప్రస్తుతం ఆమె పుట్టింట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో పెళ్లి సమయంలో తనకు ఇస్తామన్న ఒకటిన్నర తులం బంగారం ఇప్పుడు కావాలని తల్లిదండ్రులను కోరింది. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేదని, తర్వాత ఇస్తామని తల్లిదండ్రులు నచ్చచెప్పారు. దీంతో మనస్తాపానికి గురైన భారతి మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని, ఆత్మహత్య చేసుకుంది. పొలం పనులు ముగించుకొని ఇంటికి చేరుకున్న తల్లిదండ్రులు... ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కుమార్తెను చూసి వెంటనే గుంతకల్లులోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఘటనపై గుంతకల్లు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

ఉద్యోగులకు బదిలీలు తప్పనిసరి



బదిలీపై వెళ్తున్న సిబ్బందిని సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

రాప్తాడు: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు తప్పనిసరి అని ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి శివ కృష్ణ అన్నారు. మంగళవారం మండలంలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఏఎన్ఎంలు లీలావతి, అనిత, నాగమ్మ, నాగేశ్వరీ, సునీత, పావని, శ్రీలత, మమత బాయ్, లావణ్యకు స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఏఎన్ఎంల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్లు అరుణ, నరసింహ, ఎల్‌టీ శ్రీధర్ బాబు, ఫార్మసీ ఆఫీసర్ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ బిల్లు ప్రవేశ పెట్టాలి

అనంతపురం టవర్‌క్లాక్: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ బిల్లు ప్రవేశ పెట్టాలని ఆల్ ఇండియా ఎస్సీ,ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవి శంకర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక ఎన్జీవో హోంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సబ్‌ప్లాన్ చట్టం 2013 అమలు చేయాలన్నారు. మొత్తం నిధులు ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే ఖర్చుపెట్టాలన్నారు. తాజా జనాభా లెక్కల ప్రకారం నిధులు విడుదల చేసి సమగ్రంగా ఖర్చు చేయాలన్నారు. సబ్ ప్లాన్ చట్టం అమలుపై ప్రతి రెండు నెలలకోసారి సమీక్ష నిర్వహించాలని కోరారు ఈ కార్యక్రమంలో లెక్చరర్ సోమశేఖర్ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం ఆయుధం లాంటిది



మాట్లాడుతున్న ఏపీ కృష్ణచైతన్య

రాప్తాడు: పౌరులకు సమాచార హక్కు చట్టం ఆయుధం లాంటిదని ఏఓ కృష్ణచైతన్య పేర్కొన్నారు. మంగళవారం ఎం.బండమీదపల్లిలో సమాచార హక్కు చట్టం-2005పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలు తమకు ఏ సమాచారం కావాలన్నా తెలుసుకోవచ్చన్నారు. వ్యవసాయ శాఖలో ఏఏ పథకాలు అమలులో ఉన్నాయి, వాటికి ఎలా దరఖాస్తు చేసుకోవాలనే విషయాలను కూడా తెలుసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుదారులు అడిగిన సమాచారం 30 రోజుల్లోనే ఇవ్వబడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు సుజిత, రంజిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పర్యాటక కేంద్రాల అభివృద్ధికి టెండర్లు

అనంతపురం కల్చరల్: జిల్లాలోని పలు పర్యాటక కేంద్రాల అభివృద్ధి కోసం లీజు పద్ధతిలో టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖాధికారి జయకుమార్ తెలిపారు. రాప్తాడు మండలం మరూరు గ్రామంలో రెస్టారెంట్ భవనం, తాడిపత్రిలో హోటల్ భవనం, గార్లదిన్నెలో ఎంపీఆర్ డ్యామ్ వద్ద రెస్టారెంట్, విశ్రాంతి భవనాలు, గుత్తికోట వద్ద స్నాక్‌బార్, టాయిలెట్ తదితర పనులు చేపడుతున్నామన్నారు. వివరాలకు ఈనెల 31లోపు జిల్లా పర్యాటక శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఆదర్శనేత వీఎస్ అచ్యుతానందన్



అచ్యుతానందన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

అనంతపురం అర్బన్: కేరళ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ ఆదర్శ నేతని సీపీఎం, సీపీఐ నాయకులు కొనియాడారు. మంగళవారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద అచ్యుతానందన్ మృతికి సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి మాట్లాడారు. అచ్యుతానందన్ నిబద్ధత కలిగిన నేత అన్నారు. ఆయన ఉద్యమ బాట ఎందరికో స్ఫూర్తి అన్నారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి కార్యకర్త ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు సావిత్రి, నాగేంద్రకుమార్, కృష్ణమూర్తి, నాగమణి, రామిరెడ్డి, కేశవరెడ్డి, వెంకటనారాయణ, ప్రకాష్, రమణయ్యయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

దారిద్ర్యం!

నగరంలోని రహదారులు దారుణంగా తయారయ్యాయి. రోడ్లపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే వర్షాకాలం కావడంతో గుంతల్లో వర్షపు నీరు నిలిచి రాకపోకలు సాగించడానికి అవస్థలు పడాల్సి వస్తోంది. అశోక్‌నగర్‌లోని అంబేడ్కర్ భవనం మీదుగా కలెక్టరేట్‌కు వెళ్లే దారి గుంతలమయం కావడంతో వాహనదారులు అష్టకష్టాలు పడుతున్నారు. నిత్యం కలెక్టరేట్ వెళ్లే అధికారులు రహదారి దుస్థితి కళ్లారా చూసినా పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్ అనంతపురం.



అంబేడ్కర్ భవన్ వద్ద గుంతలమయమైన రహదారి



కలెక్టరేట్ ఎదురుగానే ఉన్న రోడ్డు దుస్థితి



రంగస్వామి నగర్ ప్రధాన రోడ్డు దుస్థితి



సప్తగిరి సర్కిల్‌లో రోడ్డుపై చేరిన వర్షపునీరు

మాదకద్రవ్యాలతో జీవితం చిత్తు



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి

అనంతపురం మెడికల్: విద్యార్థులు తెలియకుండానే మాదకద్రవ్యాల వలలో పడుతున్నారని, వాటితో జీవితం చిత్తు అవుతుందని ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగంపై వైద్య విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీల పేరుతో సమూహంగా వెళ్లి పారపాటున డ్రగ్స్ బారిన పడి జీవితాలను కోల్పోయిన వారిని ఎందరినో చూస్తున్నామన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకనుగుణంగా బాగా చదువుకుని వారికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఎక్కడైనా డ్రగ్స్ అనే విషయం తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగంతో దుష్ఫలితాలు ఎదురువతాయన్నారు. కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారి రామమోహన్‌రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీరామ్, సీఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై ఐక్య ఉద్యమం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: విద్యుత్ చార్జీల పెంపుపై ఐక్య ఉద్యమం చేపట్టాలని వామపక్ష పార్టీల నేతలు నిర్ణయించారు. మంగళవారం స్థానిక ఎన్జీఓ హోంలో విద్యుత్ చార్జీల పెంపుపై సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ అదానీ కంపెనీ రాష్ట్రంలో 59 లక్షల ఇళ్లకు బాగున్న మీటర్లను తొలగించి స్మార్ట్ మీటర్లు బిగించాలని చూస్తోందన్నారు. దీన్ని అందరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మీటర్లతో ఆన్‌లైన్ రీడింగ్ తీస్తారని, విద్యుత్ సరఫరా కోసం ముందుగానే రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. స్మార్ట్ మీటర్లతో ప్రజలపై దాదాపు రూ.25 వేల భారం పడుతుందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి, ఎస్‌యూసీఐ కార్యదర్శి రాఘవేంద్ర, ప్రజా సంఘాల నేతలుఏసురత్నం, రాజారెడ్డి, నాగమణి, కేశవరెడ్డి, కృష్ణమూర్తి, చంద్రశేఖర్‌రెడ్డి, చెన్నప్పయాదవ్, బాల రంగయ్య, సావిత్రమ్మ, నాగేంద్రకుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అనంత యువతకు జాతీయ అవార్డులు



అవార్డులతో భరత్, జీవన్, మారుతి

అనంతపురం కల్చరల్: అనంత యువకులు బిసాతి భరత్, జయమారుతి, జీవన్‌కుమార్ మరోసారి జాతీయ అవార్డులను అందుకున్నారు. దేశవ్యాప్తంగా కేవలం ఐదుగురిని ఎంపిక చేయగా అందులో ముగ్గురు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన వారే కావడం విశేషం. ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ అయిన వాటర్ ఎయిడ్ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో జల్ చాంపియన్స్ పేరిట అవార్డులను అందించింది. మంగళవారం ఢిల్లీలోని ఎస్ఎస్‌బీసీ ఒక్లాలో సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి వి.కే.మాధవన్ చేతుల మీదుగా పురస్కారాలనందుకున్న అనంత వాసులను మై భారత్ అధికారులు అభినందించారు. జల సంరక్షణ, హైజిన్, శానిటేషన్ వంటి కార్యక్రమాల పట్ల వారు విస్తృతంగా అవగాహన కల్పించారని వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

తప్పిపోయిన యువకుడి అప్పగింత



భరత్‌ను తండ్రికి అప్పగిస్తున్న సీఐ శాంతిలాల్

అనంతపురం: బ్రహ్మసముద్రం మండలం బుడిమేపల్లికి చెందిన శ్రీరాములు తన కుమారుడు భరత్(బుద్ధిమాంద్యుడు)తో సహా హైదరాబాద్ వెళ్లి మంగళవారం ఉదయం అనంతపురం ఆర్టీసీ బస్టాండుకు చేరుకున్నారు. కళ్యాణదుర్గం బస్సు ఎక్కాల్సి ఉంది. బస్టాండులో తండ్రి శ్రీరాములు మరుగుదొడ్డికి వెళ్లారు. తిరిగొచ్చాక భరత్ కనిపించలేదు. వెంటనే అనంతపురం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో తన కుమారుడు అదృశ్యం అయినట్లు శ్రీరాములు ఫిర్యాదు చేశారు. సీఐ శాంతిలాల్ స్పందించి కేసు నమోదు చేయించడంతో పాటు బుద్ధిమాంద్యం యువకుడి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. ఆర్టీసీ బస్టాండు, పరిసర ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో సీసీ కెమెరాలను పరిశీలించారు. బద్వేలు బస్సు ఎక్కాడని సీసీ కెమెరాల ద్వారా పసిగట్టారు. బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి వద్ద బస్సును ఆపి భరత్‌ను తండ్రికి అప్పగించారు. ఈ సందర్భంగా శ్రీరాములు పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు



మాట్లాడుతున్న సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గ భవాని

అనంతపురం సిటీ: రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గ భవాని ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమాఖ్య జిల్లా సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు పార్వతీ ప్రసాద్ అధ్యక్షత వహించగా రాష్ట్ర అధ్యక్షురాలు విమల, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గ భవాని, అనంతపురం జిల్లా కార్యదర్శి పద్మావతి హాజరయ్యారు. దుర్గ భవాని మాట్లాడుతూ రాష్ట్రంలో విచ్చలవిడిగా గంజాయి తరలింపు, అమ్మకాలతో యువత పెడదోవ పడుతోందన్నారు. రాష్ట్రంలో సెక్స్ రాకెట్ నడుస్తోందని, ఎంతో మంది అమాయక మహిళలను వ్యభిచార గృహాలకు తరలించే ముఠాలు రాజ్యమేలుతున్నట్లు ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వాములైన ప్రజాప్రతినిధుల అండతోనే మద్యం షాపులు వెలిశాయని, వెంటనే వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర స్థాయిలో మరో ఉద్యమానికి నాంది పలుకుతామని ప్రకటించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా సమాఖ్య నగర అధ్యక్ష, కార్యదర్శులు యశోదమ్మ, అన్ని నియోజకవర్గాల నుంచి ప్రతినిధులు, సభ్యులు తరలివచ్చారు.

కూటమి అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



అనంతకు జ్ఞాపికను అందిస్తున్న నార్పల సత్యనారాయణరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం అరాచకాలు రోజుకు రోజుకు పెచ్చుమీరుతున్నాయని, వైఎస్సార్ సీపీ కీలక నేతలను లక్ష్యంగా చేసుకుని అరెస్టులకు పాల్పడుతోందని, కూటమి అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇటీవల వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి(అనంతపురం పార్లమెంట్)గా నియమితులైన నార్పల సత్యనారాయణరెడ్డి మంగళవారం అనంతను ఆయన స్వగృహంలో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. ఏడాదిలోనే ప్రభుత్వం తీవ్రమైన ప్రజావ్యతిరేకతను మూటగట్టుకుందని తెలిపారు. వైఎస్ జగన్ సుపరిపాలన, చంద్రబాబు నయవంచన పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీలో కష్టపడి పని చేసే వారికి తప్పకుండా సముచిత స్థానం ఉంటుందన్నారు. పదవులు పొందిన వారందరూ సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీను తీసుకురావడమే లక్ష్యంగా ముందుకెళ్లాలన్నారు.

ముగిసిన బీబీ పాతిమా పీర్ల పండుగ



బీబీ ఫాతిమా చివరి దర్శనం చేయిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: నగరంలోని ఐదో రోడ్డులో బీబీ ఫాతిమా చిన్నపీర్ల పండుగ మంగళవారం ముగిసింది. చివరి దర్శనం కావడంతో ఐదో రోడ్డు మకానం అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. భక్తిశ్రద్ధలతో చక్కెర చదివింపులు చేశారు. పది రోజులుగా ఘనంగా జరిగిన పీర్ల పండుగ ముగిసిందని బీబీ ఫాతిమా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున తెలియజేశారు.

ముగిసిన చిన్నపీర్ల పండుగ



మరూరులో జలధికి వెళ్తున్న పీర్లు

రాప్తాడు: మరూరు గ్రామంలో చిన్నపీర్ల పండుగలో భాగంగా మంగళవారం పీర్ల జలధీ ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పెద్ద సరిగెత్తు సందర్భంగా పీర్ల దేవుళ్లను రకరకాల పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో రైతులు చెట్లను తీసుకొచ్చి పీర్ల చావిడి ముందు ఏర్పాటు చేసిన అగ్ని గుండంలోకి వేసి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో యువకులు అగ్నిగుండం ముందు తప్పెట వాయిద్యాల నడుమ అలావ్ తొక్కారు. సోమవారం రాత్రి, మంగళవారం సాయంత్రం పీర్లను గ్రామాల్లో ఊరేగించి జలధికి తీసుకెళ్లారు. సీఐ శ్రీహర్ష ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

ప్రజాసేవ కోసమే జన సేవాదళ్

రాప్తాడు: గ్రామీణ ప్రజలకు సేవలందించడానికే జన సేవాదళ్‌ను ఏర్పాటు చేస్తున్నామని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ అన్నారు. మంగళవారం కందుకూరు క్రాస్ సమీపంలోని సీపీఐ కాలనీలో జాతీయ ఇన్‌స్ట్రక్టర్ మురళి, రాష్ట్ర ఇన్‌స్ట్రక్టర్ జాన్సన్ బాబు ఆధ్వర్యంలో జన సేవా దళ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ అనుబంధంగా ప్రజా సేవా దృక్పథంతో జన సేవాదళ్‌ను ఏర్పాటు చేశామన్నారు. జన సేవాదళ్ ముఖ్య ఉద్దేశం విపత్తు పరిస్థితుల్లో సహాయక చర్యలు, ఆరోగ్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, పారిశుధ్య కార్యక్రమాలు, సామాజిక అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడమేనన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్ కుమార్, రాప్తాడు మండల, రూరల్ కార్యదర్శులు రవీంద్రా, రమేష్, నాయకులు నరేష్, ధనుంజయ, దుర్గా ప్రసాద్, ప్రసాద్, అక్కులన్నా, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

గోదారంగనాథుల కల్యాణం

అనంతపురం కల్చరల్: గోదాదేవి జయంతిని పురస్కరించుకుని సాయిట్రస్టు వారు మంగళవారం గోదారంగనాథుల కల్యాణం కమనీయంగా సాగింది. తపోవనంలోని శివశక్తిసాయిదేవస్థానం వేదికగా ఉదయం అనంత పద్మనాభస్వామి సుప్రభాత సేవ, అభిషేకం, విశ్వక్సేన ఆరాధన అనంతరం వేదమంత్రాల నడుమ ఆధ్యాత్మికవేత్త మణూరు నాగరాజు ఆధ్వర్యంలో కల్యాణం నేత్రపర్వంగా జరిపించారు. నిర్వాహకులు విజయ్‌కుమార్, దేవేంద్ర, రాఘవేంద్ర తదితరులు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. ఆషాఢం నుంచి శ్రావణం వరకు వచ్చే 8 ద్వాదశులలో 8 మంది దేవతామూర్తుల కల్యాణోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

రేపు జాషువా వర్ధంతి

అనంతపురం కల్చరల్: స్థానిక ఆర్ట్స్‌కాలేజ్ ఎదురుగా ఉన్న జాషువా విగ్రహం వద్ద గురువారం జాషువా 54వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నాగలింగయ్య, నానీల నాగేంద్ర మంగళవారం తెలిపారు. మహాకవి గుర్రం జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి రచయితలు, కవులు, వివిధ సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

ఎస్కేయూ వీసీ, రిజిస్ట్రార్‌కు సత్కారం



ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ అనితను సత్కరిస్తున్న బోధనేతర సంఘం నేతలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి. అనిత, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు పదవీ కాలం ఏడాది పూర్తయిన సందర్భంగా ఘనంగా సత్కరించారు. బోధనేతర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వీసీని గజమాలతో సత్కరించారు. ఏడాది కాలంలో వీసీ చేపట్టిన కార్యక్రమాలపై ప్రశంసించారు. వర్సిటీకి మనమేమి ఇచ్చాం అనే దృక్పథంతోనే ప్రతి ఉద్యోగి పనిచేయాలని ఈ సందర్భంగా వీసీ పిలుపునిచ్చారు. రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ తాను రీసెర్చ్ కమ్ స్టాటిస్టికల్ ఆఫీసర్‌నని, రిజిస్ట్రార్ పోస్టు తాత్కాలికమేనన్నారు. తనను ఎప్పుడూ స్టాటిస్టికల్ ఆఫీసర్‌లాగే గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో బోధనేతర సంఘం అధ్యక్షుడు కే. తిమ్మప్ప, జనరల్ సెక్రెటరీ ఎస్. మారుతి, వైస్ ప్రెసిడెంట్ నాగ మునీంద్ర, ట్రెజరర్ గోవింద రాజులు, తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా వాసవీమాత



అలంకరణలో వాసవీ మాత

ఆత్మకూరు: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని శాకంబరిగా అలంకరించి పూజలు చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పోలేరమ్మకు బోనాలు



బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

ఆత్మకూరు: సింగంపల్లిలో మంగళవారం పోలేరమ్మ దేవతకు బోనాల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మొదటగా గ్రామంలో పోలేరమ్మ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. అనంతరం డప్పులతో ప్రతి ఇంటి నుంచి బోనాలు ఎత్తుకొని ఆలయం వద్దకు చేరుకొని అమ్మవారికి సమర్పించారు. ఆషాఢ మాసంలో మూడు మంగళవారాలు పోలేరమ్మకు బోనాలు సమర్పిస్తున్నట్లు గ్రామస్తులు తెలియజేశారు.

'ఎన్ఆర్ఐ'లో రహదారి భద్రతపై అవగాహన



మాట్లాడుతున్న ఆర్టీఓ సునీల్

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎన్ఆర్ఐ ఇంటర్నేషనల్ జూనియర్ కళాశాలలో మంగళవారం రహదారి భద్రతలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేవారు. ట్రాఫిక్ నియమాలు, సురక్షితమైన డ్రైవింగ్ ప్రాముఖ్యత, బాధ్యతాయుతమైన రహదారి ప్రవర్తనపై అవగాహన కల్పించారు. ఆర్టీఓ సునీల్ మాట్లాడుతూ యువతే మన దేశ భవిష్యత్తు అన్నారు. బాధ్యతాయుతమైన పౌరులను నిర్మించేందుకు చిన్నవయస్సులోనే రోడ్డు భద్రతపై అవగాహన ఎంతో కీలకమన్నారు. ఎన్ఆర్ఐ విద్యా సంస్థల చైర్మన్ వెన్నపూస విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పౌరస్పృహ, సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో విద్యా సంస్థల వైస్ చైర్మన్ దివ్యా రెడ్డి, ఎండీ వెన్నపూస చంటి రెడ్డి, అనూష, డైరెక్టర్ శైలజ, నవీన, ప్రిన్సిపాళ్లు అంబికా రెడ్డి, హర్షవర్ధిని, అపర్ణ, విద్యారెడ్డి, ప్రశాంత్ నాయక్, వైస్ ప్రిన్సిపాళ్లు కవిత, ప్రశాంతి, మల్లికా, సుష్మిన్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించండి



డ్వామా పీడీకి వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు

అనంతపురం టౌన్: ఉపాధి హామీ కూలీలకు వెంటనే వేతనాలను మంజూరు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మంగళవారం డ్వామా పీడీ సలీంబాషాకు వినతి ప్రతం అంజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.10 కోట్లకు పైగా బిల్లులు రావాల్సి ఉందన్నారు. ఉపాధి హామీలో నూతన సాఫ్ట్‌వేర్ పేరిట కూలీలకు వేతనాలు ఇవ్వకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఉపాధి హామీ పని చేస్తూ మృతి చెందిన శ్రామికులకు రూ.25 లక్షలు నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, నాయకులు భాస్కర్, వెంకటచలపతి, నాగలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

అనంతపురం: నగరంలోని నారాయణపురంలో నివాసం ఉంటున్న అందే శివశంకర్ (38) అదృశ్యమయ్యాడు. వివరాలు..కూడేరు మండలం అరవకూరు గ్రామానికి చెందిన శివశంకర్‌కు ఈశ్వరమ్మ, అపర్ణ ఇద్దరు భార్యలు. చిన్న భార్య అయిన అపర్ణ వద్ద శివశంకర్ ఉంటున్నాడు. అపర్ణతో మనస్పర్థలు రావడంతో సెల్ స్విచాఫ్ చేసుకుని ఎక్కడికో వెళ్లిపోయాడు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. చిన్న భార్య అపర్ణను అడిగినా సరైన సమాధానం ఇవ్వలేదు. దీంతో బాధితుడి తల్లి కురుబ ముత్యాలక్క తన పెద్దకుమారుడు ఈశ్వరయ్యతో కలిసి నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.